ఆంధ్రప్రభ - 01-08-2001

# చెంచాలు

నిన్నటి వరకూ అసిస్టెంట్ డైరెక్టరు ఆధిపత్యంలో ఉండి, ఈ రోజు డైరెక్టరు ఆధిపత్యంలోకి వచ్చిన ఆ ఆఫీసు హోదా పెరిగి, పెద్ద కుర్చీకి పదోన్నతి కలిగింది. అయితే ఇంతవరకు ఎ.డి.గా పనిచేస్తోన్న సహనకుమార్‌కి ఆ కుర్చీలో కూర్చునే భాగ్యం కలగలేదు. హైటెక్ సిటీ ఆఫీసు నుంచి పదోన్నతి పొందిన డైనమిక్ పర్సనాలిటీ భరణ్‌కుమార్ బదిలీ మీదవచ్చి డైరెక్టరు హోదాలో ఆ కుర్చీ నాక్రమించాడు.

అంతవరకూ సహనకుమార్ అందుకొంటున్న చిరునవ్వులూ, గుడ్‌మార్నింగ్‌లూ ఇప్పుడు రెట్టింపుగా భరణ్‌కుమార్ అందుకోసాగాడు. ఒకప్పుడు ప్రతినమస్కారం చేసిన సహనకుమార్, ఇప్పుడు ముందుగానే మరొకరికి నమస్కారం పెట్టే స్థితికి దిగజారిపోయాడు. సహనానికి మారుపేరైన సహనకుమార్ రాజీపడిపోగా, ఆఫీసులో ఓపాటి సీనియర్ ఉద్యోగులందరూ ఆయన్ని నిర్లక్ష్యం చేసి, విషయాలనీ, ఫైళ్లనీ నేరుగా డైరెక్టరు భరణ్‌కుమార్ వద్దకు

తీసుకుపోసాగారు. భరణ్‌కుమార్ కూడా దీన్నో అవకాశంగా తీసుకొని కింది ఆఫీసర్లని తిన్నగా తన దగ్గరికి రావడానికి మరింత ప్రోత్సహించాడు.

ఓ రోజు సాయంత్రం చీఫ్ ఇంజనీర్ ఉత్పన్నశర్మా, అతని భార్య సంతోషీ వాళ్ల క్వార్టరు ప్రాంగణంలో నిల్చుని ఉండగా ఆ రోడ్డమ్మట షికారుకని బయలుదేరిన భరణ్‌కుమార్, ఆయన సతీమణి స్వాహాదేవి ఆగి పలుకరించారు. ఉత్పన్నశర్మ దంపతులు పొంగిపోయి 'రండి రండి' అని సాదరంగా వారి నాహ్వానించి, లోపలికి తీసుకువెళ్లి సోఫాలో సుఖాసీనుల్నిచేశారు.

సంతోషికి మనసంతా సంతోషంతో నిండిపోగా, తడబడుతూన్న అడుగులతో మంచినీళ్ళు నింపి, ముందు హాల్లోకి తీసుకువెళ్లి బల్ల మీద పెట్టింది. స్వాహాదేవి సొగసుగా భర్త పక్కన కూర్చుని ఓ గ్లాసందుకొని అరచేతుల మధ్య సుతారంగా తిప్పుతూ, "ఈ గ్లాసులు చూడండి ఎంత అందంగా ఉన్నాయో! ఇంత స్వచ్ఛమైన గాజునీ, అద్భుతమైన నగిషీలను ఇంతవరకూ చూడనేలేదు!" అని భర్తని ఉద్దేశిస్తూ అని, "ఎక్కడ కొన్నారు?" అని సంతోషిని ప్రశ్నించింది.

"మా అన్నయ్య జర్మనీ నుంచి తీసుకొచ్చాడు" అంది సంతోషి గొప్పగా. జర్మనీ తయారు నిజమే కాని, వాటినిచ్చింది వాళ్ళన్నయ్య కాదు ఓ కంట్రాక్టరు!

"మా అన్నయ్యా ఉన్నాడు అమెరికాలో! కాని ఏం లాభం? వచ్చినప్పుడల్లా మా ఆయనకో షేవింగ్ ఫోం, నాకో పెర్ఫ్యూమ్ స్ప్రే తీసుకొచ్చి మొహాన పడేస్తాడు!" అంది స్వాహాదేవి చిన్నగా నవ్వుతూ.

ఆమె కలుపుగోరుతనానికి ఉత్పన్నశర్మ దంపతులు చాలా ముచ్చట పడిపోయారు. కాఫీ, టిఫిన్ల ఏర్పాటు కోసం సంతోషి కిచెన్‌లోకి దారితీసినప్పుడు స్వాహాదేవి కూడా లోపలికి వెళ్లి, ఏవేవో కబుర్లు చెబుతూ పచ్చిమిరపకాయలు తరిగీ, అల్లం ముక్కలు తరిగీ చిన్నా చితకా సహాయం చేసింది. సంతోషి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. కాఫీ, టిఫిన్లు అరగించిన తర్వాత భరణ్‌కుమార్, స్వాహాదేవి లేచి వెడ్తూండగా సంతోషి స్వాహాదేవికి బొట్టు పెట్టి ఓ దళసరి ప్లాస్టిక్ సంచీ చేతికందించింది.

"ఏంటిది? నో ఫర్మాలిటీస్!" అంది స్వాహాదేవి, సంచీ అందుకుంటూ.

"మొదటిసారిగా మా ఇంటి కొచ్చారు. ఏవో రెండు బత్తాయిలూ, నాలుగు అరటిపళ్లూ!" అంది సంతోషి.

వాళ్లు వెళ్లిన తర్వాత ఉత్పన్నశర్మ భార్య వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

"కంట్రాక్టరిచ్చినవే కదా అని ఆ ఆరు గ్లాసుల్నీ పేక్ చేసి, పళ్లతో బాటు సంచీలో పెట్టాను!" అంది సంతోషి.

"నా మనసులోని ఉద్దేశమూ అదే! నువ్వెలా కనిపెట్టావో, గ్రేట్!" అన్నాడు ఉత్పన్నశర్మ.

డైరెక్టర్ భరణ్‌కుమార్ ధర్మపత్నీ సమేతంగా ఉత్పన్నశర్మ ఇంటికి వెళ్లాడన్న వార్త ఆ రాత్రికల్లా కాలనీలో ఉన్న సీనియర్ ఆఫీసర్ల అందరి ఇళ్లకూ పాకిపోయింది. దంపతులిద్దరూ ఫోన్ల ద్వారా అభినందనవర్షాల్ని కురిపించుకున్నారు. ఆ రాత్రి సంతోషి దంపతులు అఘమేఘాల

మీద తేలిపోగా, కొంతమంది ఆఫీసర్ల అసూయాపరులైన భార్యలు భర్తల్ని దూరంగా తోసేశారు!

ఇది జరిగిన మూడు రోజుల తర్వాత, మధ్యాహ్న సమయంలో స్వాహాదేవి కాలనీలో పార్కు వైపు ఒక్కర్తీ నడుచుకుంటూ వెళ్లింది. ఓ గేటు దగ్గర నిల్చుని కూరలవాడికి డబ్బులిస్తున్న ఓ స్త్రీని చూసి ఆగి, "హల్లో!" అని పలకరించింది. ఆవిడ చీఫ్ కెమిస్ట్ 'రసాయనరెడ్డి' భార్య, సంయోగి. స్వాహాదేవిని గుర్తించి, "ఎంత భాగ్యం! ఎంత భాగ్యం!" అంటూ ఆహ్వానించి లోపలికి తీసుకువెళ్లింది.

"ఒక్కర్తీ బోరు కొట్టి, కాస్త ఎండగా ఉన్నా నిద్ర గన్నేరుచెట్ల నీడ ఉంది కదా అని బయలుదేరాను" అంది స్వాహాదేవి సోఫాలో కూర్చుంటూ. స్వాహాదేవి హాలు నంతా పరికించి చూసి, సంయోగి తెచ్చిన పైనాపిల్ జ్యూస్ తాగుతూ కబుర్లలోకి దిగింది.

డైరెక్టర్‌గారి భార్య తమ ఇంటికి వచ్చిందన్న సంగతి అందరికి తెలియాలన్న తపనతో రెండు పేము కుర్చీలని ముందు వరండాలో వేసి, "రండి, బయట వరండాలో కూర్చుని, మా గార్డెన్‌లోని పూలమొక్కల్ని చూసుకుంటూ కబుర్లు చెప్పుకుందాం!" అంది సంయోగి.

'అలాగే' నంటూ స్వాహాదేవి ముందు వరండాలోకి వెళ్లి కూర్చుంది.

"మీ హాల్లో వేలాడుతున్న ఆ ఎగ్రషేడ్ ఎలక్ట్రికల్ హేంగింగ్ లాంప్ చాలా ఆకర్షణీయంగా ఉంది. చాలాకాలం క్రితం ఇటువంటి లాంప్‌ని బొంబాయిలో కార్లో వెడుతూ ఓ షాపు విండోలో చూశాను, కాని సమయం చిక్కక కొనలేకపోయాను" అంది స్వాహాదేవి.

కాస్సేపు ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకొన్న తర్వాత తన బంగళాకి వెళ్లిపోయింది.

ఆ సాయంత్రం ఇంటికి వచ్చిన రసాయన రెడ్డి, ఎగ్రషేడ్ లాంప్ లేని వెలితి చూసి కనుబొమలెగరవేశాడు. డైరెక్టరు భార్య వచ్చిన సంగతి వివరించి, "ఇందాకా బాబు కాలేజి నుండి తిరిగిరాగానే ఆ లాంప్‌ని తీయించి శుభ్రంచేసి, దాని ఒరిజినల్ పాక్‌లో ఉంచి, బాబు చేతనే గుట్టుగా పంపించాను!" అంది సంయోగి.

"సరే, ఆవిడొచ్చిన సంగతి అందరికి తెలిసినా పర్వాలేదుకాని లాంప్ పంపించిన సంగతి మట్టుకు గోప్యంగా ఉంచు! తెలిసిందంటే కాకాగాళ్లంటారు!" అని కాస్త హెచ్చరించాడు రసాయనరెడ్డి.

ఓ రెండు నెలల వ్యవధిలో ఆ కాలనీలో ఉన్న ఆఫీసర్ల క్వార్టర్లన్నీ పెద్దాయన, పెద్దావిడ పాదస్పర్శలతో పావనమైపోయాయి. అటుపైన డైరెక్టరు భరత్‌కుమార్ ధర్మపత్నీసహిత సందర్శనాలు గొప్పగా చెప్పుకునే ప్రత్యేకత ఎవరికీ లేకుండా పోయింది.

పాప పుట్టిన రోజని ఓసారి స్వాహాదేవి, తనకు పరిచయమైన ఆఫీసర్ల భార్యలనందర్నీ పేరు పేరునా ఫోన్లో పిలిచింది. అందులో కొందర్ని కాస్త ముందుగా వచ్చి తనకు కాస్త కిచెన్‌లో సహాయం చెయ్యవలసిందిగా అర్థించింది.

"అయ్యో ఎంత మాట?! మీరు మా ఇంటికి అతిథిగా వచ్చి, మా వంటింట్లోకి అడుగు పెట్టి ఏ రకమైన అరమరికలూ లేకుండా సహాయం చేశారు. అయినా మీ కెందుకు శ్రమ?

ఏం కావాలో చెప్పండి, మేమే చేసి పంపుతాం!" అని ఆవిడ్ని మొహమాటపెట్టేశారు.

'స్వాహాదేవి అనిష్టంగానే ఒప్పుకొంటూ, "అందరికి తెలిస్తే బావుండదేమో?" అని చిన్నగా ఓ హింట్ పారేసింది.

వాళ్లలో కొందరు రెక్కలు ముక్కలు చేసుకొనీ, మరికొందరు స్వగృహ ఫుడ్స్‌కి ఆర్డరిచ్చీ స్వాహాదేవి కోరిన తినుబండారాల్ని సమకూర్చి రహస్యంగా బంగళాకి తరలించారు.

పార్టీ గ్రాండ్‌గా జరిగింది. పదో క్లాసు చదువుతున్న పదహారేళ్ల పాపకి ఖరీదైన బహుమతులెన్నో లభించాయి.

పెరుగు గారెలు దూదిపింజెల్లా ఉన్నాయనీ, మైసూర్‌పాక్ మెత్తగా చక్కగా కుదిరిందనీ, జంతికలు మహా కమ్మగా ఉన్నాయనీ, మరోటీ మరోటీ మహా మజాగా ఉన్నాయనీ ప్రశంసలు ప్రతిధ్వనిస్తోంటే చేసినవాళ్ల జాకెట్ల కుట్లు తెగిపోయాయి. తెప్పించిన వాళ్ల మనసులు తెప్పరిల్లాయి. స్వాహాదేవి రహస్యంగా పిండివంటలు పంపిన వారందరికి కృతజ్ఞతలు తెలుపుకొంది.

ఆ తర్వాత కొంత కాలానికి రెండో రౌండు మొదలయ్యేసరికి, స్వాహాదేవి మనస్తత్వం అందరికి కొద్దికొద్దిగా అర్థమవసాగింది. అంతవరకూ ఆవిడొచ్చిన సంగతే చెప్పుకున్నారు కాని, ఆవిడ మెచ్చుకున్న వాటిని ఇచ్చుకొన్న సంగతి చెప్పుకోకుండా గుప్తంగానే ఉంచుకొన్నారు. మొదటిసారి గొప్పకు పోయి గౌరిగించుకున్నా, రెండోసారి స్వాహాదేవి కాస్త తిన్నగా, మరి కాస్త అన్యాపదేశంగా వదిలే కోరికల శరాలు ఇబ్బంది కలిగించడంతో, ఆఫీసర్ల భార్యలందరూ ఒకరి చెవులు మరొకరు కొరుక్కోసాగారు, భర్తలతో ఆవిడ ఆగడాల్ని చెప్పుకొన్నారు.

"స్వాహాదేవి ఎప్పుడు గుమ్మంలో అడుగు పెడ్తుందో తెలియదంటున్నారుగా ఎందుకైనా మంచిది, షోకేసులో ఉన్న మంచిమంచి వస్తువుల్నీ, ఇతర డెకొరేషన్ పీసెస్‌నీ దాచేసి కాస్త ఆకర్షణీయంగా ఉండే చౌకబారు ప్లాస్టిక్ వస్తువుల్తో గృహాలంకరణ చెయ్యండి" అని కొందరు భర్తలు హితోపదేశం చేశారు.

తమ స్టేటస్ సింబల్స్‌గా ఉండే అందమైన, ఖరీదైన వస్తువుల్ని ఇనుప బీరువాల్లో దాచడానికీ, ప్యాక్‌చేసి అటక ఎక్కించడానికీ కొంతమంది ఆఫీసర్ల భార్యలకు మనసొప్పలేదు. కాని డైరెక్టరు భార్యకు భయపడి వారాపని చెయ్యక తప్పలేదు. అసిస్టెంటు డైరెక్టరు సహనకుమార్ ఇంటికి వాళ్లిద్దరూ వచ్చిన మొదట్లో ఓ సారి వెళ్లారు. సహనకుమార్ భార్య పోయి మూడేళ్లు దాటింది. అతని ఇంట్లో  అతని తల్లీ, ఆరేళ్ల కూతురూ, నాలుగేళ్ల కొడుకూ, అతని విధవ అప్పగారూ, ఆమె ముగ్గురు పిల్లలూ ఉంటారు. ఆ సందడి గృహంలో భరణ్‌కుమార్ దంపతులు ఓ కప్పు కాఫీ తాగి బయటపడ్డారు. రెండోసారి ఆ ఇంట్లో అడుగు పెట్టలేదు వాళ్లిద్దరూ.

క్రమేపి కాలనీలో పెరుగుతున్న గుసగుసలన్నీ సహనకుమార్ చెవిన పడ్డంతో ఓ రోజు డైరెక్టర్ ఛాంబర్‌లో ప్రవేశించి, గది బయటున్న ఎర్రదీపం బాస్ చేత ఆన్ చేయించి ఆయన మీదా, ఆయన భార్య మీదా జరుగుతున్న ప్రచారాన్ని గురించి వివరించి, "మీ హితవు కోరిన వాణ్ణి కాబట్టి చొరవ తీసుకొని చెప్పాను. క్షమించండి" అని ముగించాడు.

"మీరు చెప్పిందంతా నిజమే, కాదనను. వాళ్ల తల్లిదండ్రులకి ముగ్గురు మగపిల్లల తర్వాత ఆమె ఒక్కర్తే ఆడపిల్ల! గారాబంతో అడిగినవన్నీ ఇచ్చి పాడుచేశారు. ఇప్పుడూ అదే అలవాటై పోయింది. ఒక పక్కన స్నేహంగా ప్రవర్తిస్తూనే తనకు నచ్చిన వస్తువు ఎవరింట్లో చూసినా నసపెట్టేస్తుంది! విసిగి వేసారిపోయాను. ఏం చెయ్యాలో తెలియదు!" అన్నాడు లేని దుఃఖాన్ని ముఖమంతా పులుముకొంటూ.

సహనకుమార్ కాస్త ఓదార్చి, కొత్తగా ఛార్జి తీసుకున్న 'ఛైర్మన్- కమ్-మేనేజింగ్ డైరెక్టర్' విజిట్ కోసం చేసిన ఏర్పాట్లని గురించి తెలియజేసి ఛాంబర్ నుంచి నిష్క్రమించాడు.

అరడజను బిజినెస్ మేనేజ్‌మెంట్ డిగ్రీలను సంపాదించి పేరు మోసిన సర్వభక్షక కుమార్, ఆ కంపెనీ అధ్యక్ష పదవిని స్వీకరించి దేశంలోని కంపెనీ కేంద్రాలన్నింటినీ సందర్శించసాగాడు. అనుకొన్న తేదీకి ధర్మపత్నీసమేతంగా, బోర్డు మెంబర్లు కూడా వెంటరాగా పై కేంద్రాన్ని కూడా సందర్శించాడు.

ఆఫీసు నివేదికను అలవోకగా విన్న ఛైర్మన్ మధ్యమధ్య 'ఓహ్, వెరీగుడ్! అహో, వెరీబాడ్!' అంటూ చిరునవ్వులూ, వ్యంగ్యబాణాలూ వదిలాడు. ఒక్కోసారి కనుబొమ్మలు ముడిచాడు. తర్వాత అందర్నీ ఉద్దేశించి అన్నాడు.

"లక్ష్యసాధనకు నిరంతర ప్రయత్నం అవసరం. స్వోత్కర్ష కాదనుకొని నా ఉదాహరణే తీసుకోండి. చిన్నప్పట్నుండీ నాకు నచ్చిన వాటినీ, నేను మెచ్చిన వాటినీ సాధించడంలో చాలా పట్టుదలగా ఉండేవాణ్ని. అందుకనే అచిరకాలంలోనే ఈ స్థాయి కెదిగాను. కంపెనీ అభివృద్ధి కోసం మీ ధ్యేయమూ ఇలాగే ఉండాలి..."

కరతాళ ధ్వనులతో మీటింగ్ ముగిసింది.

ఆ రాత్రికి క్లబ్బులో డిన్నరు ఏర్పాటు చేశారు. ఆఫీసర్ల భార్యలందరూ డైరెక్టరు భరణ్‌కుమార్‌ని, భార్య స్వాహాదేవిని నిర్లక్ష్యం చేసి, ఛైర్మన్ భార్య చుట్టూ చీమల్లా చేరి స్తోత్రపాఠాలు వల్లెవేయసాగారు. ఆవిడ అందర్నీ అతి నిశితంగా చూస్తూ, "ఓహ్, మీ మెళ్లో రవ్వల నెక్లెస్ ఎంత బావుంది! ఆహ్, ఆ వజ్రాల దుద్దులు మీ చెవులకెంతటి అందాన్ని ఇస్తున్నాయ్. టెర్రిఫిక్, ఈ ముత్యాల గాజులు మీ చేతులకు సూపర్బ్‌గా ఉన్నాయి!" అంటూ అక్కణ్ణుంచి జారుకోవడానికి చేసిన వాళ్ళ ప్రయత్నాల్ని నెరవేరనివ్వలేదు.

ఇది ఇలా ఉండగా, డైరెక్టరు భరణ్‌కుమార్ తన్ను వెన్నంటి వస్తున్న భార్యను ఛైర్మన్‌కు పరిచయం చేశాడు. పరిచయ నమస్కారాలైన తర్వాత అప్పటికే నాలుగైదు పెగ్గులు బిగించిన పెద్దాయన గుడ్లప్పగించి చూస్తూ, "వాట్ ఎ గ్రేస్! మిస్టర్ భరణ్‌కుమార్, ఇంతటి సౌందర్యరాశిని భార్యగా పొందిన మీరు చాలా అదృష్టవంతులు!" అన్నాడు కాస్త ముద్దముద్దగా, ముద్దుముద్దుగా.

స్వాహాదేవి పెదవుల మీద మందహాసం వెలిసింది.

డైరెక్టరు భరణ్‌కుమార్ ఆ రోజు ఉదయం మీటింగ్‌లో ఛైర్మన్-కమ్-మేనేజింగ్ డైరెక్టరు సర్వభక్షక కుమార్ చెప్పిన మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని మౌనంగా రోదించాడు.